క్లుప్తంగా...

మొక్కలు నాటిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం రాజేంద్రనగర్ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనజయప్రకాష్‌లు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలంతా ఇప్పటి నుంచే మొక్కలను నాటి అవి ఎదిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రేమ్‌గౌడ్ పాల్గొన్నారు.

బూత్ అధ్యక్షులకు నూతన ఓటరు లిస్ట్ పంపిణీ

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఎన్నికలకు బీజేపీ సర్వత్రా సిద్ధంగా ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. అత్తాపూర్ డివిజన్ బూత్ అధ్యక్షులకు నూతన ఓటర్ లిస్టు పంపిణీ చేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ఒకసారి క్షుణంగా పరిశీలించుకోని రద్దు చేసిన ఓటర్లను వెంటనే కొత్త ఓటరు కార్డు కోసం దరఖాస్తులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో కొంగ్ల నవీన్, సాయి యాదవ్, రాజు పైల్వాన్, విజయ్‌రావుత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు



రాజేంద్రనగర్ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజేంద్రనగర్ తహసీల్దార్‌ను శనివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణముదిరాజ్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎస్.విజయ్‌కుమార్, రాజేంద్రనగర్ డివిజన్ సీనియర్ నాయకులు కీర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మనెంట్ చేయాలని ఎమ్మెల్యేకు వినతి

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరుతూ శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి కార్మికులతో కలిసి ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకు తమ ఉద్యమం కొనసాగిస్తామన్నారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతి పత్రం అందించామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏఐటీయూసీ మండల కార్యదర్శి టి.ఆనంద్, శ్రీను, సంతోష్, ప్రమీల, లక్ష్మి, శేఖర్, రంజిత తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు



సులేమాన్‌నగర్‌లో ఓటరు జాబితాలో పేర్లు సరి చూసుకుంటున్న ప్రజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం బీఎల్‌వోలను అధికారులు ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలో తమ పేర్లను సరి చూసుకునేందుకు, అలాగే తప్పొప్పులు కొత్తగా 18 సంవత్సరాలు నిండిన ఓటర్లను చేర్చుకునేందుకు ఈ అవకాశాన్ని కల్పించారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి





ఎర్రకుంట చెరువు వద్ద మొక్కలు నాటుతున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ ఎర్రకుంట చెరువు వద్ద హరితహారం(కోటి మొక్కలు నాటే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ మహేందర్‌గౌడ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా కమీషనర్ శరత్‌చంద్రతో కలిసి ఆయన మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలంతా విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హరిత వనాలను అభివృద్ధి చేస్తాం



వజ్రోత్సవ ఆకారంలో మొక్కలు నాటి అభివృద్ధి చేస్తున్న నార్సింగి అధికారులు

మణికొండ: మున్సిపాలిటీలలో అందుబాటులో ఉన్న పార్కులు, ప్రభుత్వ స్థలాలలో వీలైనన్ని ఎక్కువ మొక్కలను పెంచి హరిత వనాలను అభివృద్ధి చేస్తామని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖ యాదగిరిలు అన్నారు. శనివారం స్వతంత్ర వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని జంట మున్సిపాలిటీలలో వారు మొక్కలు నాటారు. పెరుగుతున్న జనాభాతో పాటు పచ్చదనం అదే స్థాయిలో పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మెన్‌లు కె. నరేందర్‌రెడ్డి, జి. వెంకటేశ్‌యాదవ్, కమీషనర్‌లు కె. ఫల్గుణ్‌కుమార్ పాల్గొన్నారు.



మణికొండ నెక్నాంపూర్‌లో మొక్కలు నాటుతున్న చైర్మెన్, వైస్ చైర్మెన్

నాటే ప్రతి మొక్కను సంరక్షించాలి

ఏజీవర్సిటీ: స్వంతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చెపట్టిన కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం స్థానిక శాసన సభ్యుడు ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి విశ్వవిద్యాలయం అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటారు. నాటే ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ చినా నాయక్, కార్పొరేటర్ అర్చన జయ ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్

విస్తరాకుల పరిశ్రమలో అగ్నిప్రమాదం

రాజేంద్రనగర్: షాట్ సర్క్యూట్‌తో విస్తరాకులు తయారు చేసే గోదాములులో మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలో గోదాము మొత్తం మంటలు వ్యాపించి కాలిబూడిదైంది. అత్తాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో విశాల్ అనే వ్యక్తి విస్తరాకులు తయారు చేసే యంత్రాలను ఏర్పాటు చేసి విస్తరాకులను తయారు చేస్తున్నాడు. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో పాటు రానున్న వినాయక చవితిని పురస్కరించుకొని పెద్ద ఎత్తున తయారు చేసి గోదాములో భద్రపరిచాడు. శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలో గోదాములో వ్యాపించాయి. దట్టమైన పొగ రావడంతో పని చేస్తున్న ఇద్దరు మహిళలు బయటకు పరుగులు తీసి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. బస్తీలోనే ఈ గోదాము ఉండడంతో దట్టపొగ కారణంగా స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అత్తాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకోని మంటలను ఆర్పారు. ఈ సంఘటనలో ఐదు లక్షల రూపాయల నష్టం వచ్చిందని యజమాని వెల్లడించారు.

క్రాప్ దర్పణ్ యాప్‌పై ఓరియంటేషన్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఐఐటీ హైదరాబాద్ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా రూపొందించిన క్రాప్ దర్పణ్ మొబైల్ యాప్ పై శనివారం వర్చువల్ పద్ధతిలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.విశ్వవిద్యాలయం ఇంచార్జి ఉపకులపతి రఘునందన్‌రావు సూచనల మేరకు వ్యవసాయ విస్తరణ వ్యవసాయ,అధికారులు , ఏడీఏలకు తమ దైనందిన విధులలోల ఉపయోగపడే విధంగా క్రాప్ దర్పణ్ యాప్‌ను రూపొందిస్తున్నారు. ఈ యాప్ పనితీరు ఇందులో పొందుపర్చవలసిన సమచారం పైచర్చించారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాగర్జనకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు





బహిరంగ సభకు తరలివెలుతున్న మణికొండ మున్సిపల్ చైర్మెన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: చేవెళ్ల కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించిన ప్రజాగర్జన బహిరంగ సభకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధి నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెల్లారు. మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్, పార్టీ అధ్యక్షుడు జితేందర్, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, పార్టీ పీసీసీ సభ్యుడు ఎం. జైపాల్‌రెడ్డిల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనాలలో పెద్ద ఎత్తున తరలివెల్లారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో శనివారం రాత్రి అలుమ్ని (పూర్వ విద్యార్థుల సమ్మేళనం) నిర్వహించారు. కళాశాలలో చదువుకుని వివిధ రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులతో సమావేశమై ఉన్నత స్థానాలలో స్థిర పడాలంటే చదువులతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, పారిశ్రామిక అనుభవం ఎంతో అవసరమని వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో వారు ఆడి సందడి చేశారు. కళాశాల చైర్మెన్ డి. ప్రవీ.ణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించిన విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరం



గచ్చిబౌలిలోని ఎస్కీలో ముగింపు సమావేశంలో అతిథులు, పలు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: మానవాళికి మంచి భవిష్యత్తును అందించేందుకు సమష్టి కృషి అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఈ–20 సమ్మిట్, అంతర్జాతీయ సదస్సును ' టువర్డ్స్ నెట్ జీరో ఇన్ ఇండస్ట్రీయల్ ఆఫ్ జీ–20' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాబోయే తరాలకు మంచి వాతావరణం అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్మార్ట్ సిటీలతో సహ స్థిరమైన పట్టణాభివృద్ధి, చమురు, గ్యాస్, రసాయనాలు, సిమెంట్, ఇనుము, ఇన్సర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీని ఏకీకృతం చేయడం, పారిశ్రామిక రంగం ఆవశ్యకతవంటి కీలక అంశాలపై దృష్టి సారించాలని వక్తలు అభిప్రాయ పడ్డారు. ముగింపు వేడుకల్లో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం జగదీవార్, పద్మశ్రీ డాక్టర్ త్రిపురనేని చౌదరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, ఐఈఐ అధ్యక్షుడు శివానందరాయ్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సూర్యప్రకాశ్, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల బతుకుల్లో మార్పు



బుద్వేల్ నుంచి చేవెళ్ల సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు మారుతాయని రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోరని బాలరాజు అన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రజా గర్జన సభకు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బుద్వేల్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి డివిజన్ అధ్యక్షుడు కోరని బాలరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణ, పెండ్యాల శ్రీధర్, భూపాల్ తదితరులున్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మణికొండ: ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం చదువులే కాకుండ సంపూర్ణ నైపుణ్యాలను పెంపొందించుకున్నపుడే జీవితంలో రాణించే అవకాశం ఉంటుందని యష్ టెక్నాలజీస్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ గౌరి ప్రసాద్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కొత్తగా చేరిన విద్యార్థినులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ పరిశ్రమల రంగంలో ప్రస్తుతం కేవలం చదువుకున్న వారు కాకుండా అనుభవం సైతం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

బాలిక అదృశ్యం



అదృశ్యమైన బాలిక

శంషాబాద్ : ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైంది. రాజేంద్రనగర్ సర్కిల్ ఇంద్రాసొసైటీలో నివాసముండే గడ్డమీది నర్సింహా కుమార్తె అంకిత (10) శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లింది. ఎంతకి తిరిగి రాకపోవడంతో బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రపంచ విజ్ఞాన భాండాగారమే భారతీయ సాహిత్యం

అఖిల భారతీయ సాహిత్య కార్యదర్శి దినేష్ పత్రాప్‌సింగ్

బండ్లగూడ: ప్రపంచ విజ్ఞాన భాండాగారమే భారతీయ సాహిత్యం అని అఖిల భారతీయ సాహిత్య కార్యదర్శి దినేష్ ప్రతాప్‌సింగ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సరస్వతీ విద్యాపీఠం శారదాధామంలో నిర్వహిస్తున్న రెండు రోజుల సాహిత్య సంఘోష్టి శనివారం ప్రారంభమైంది. తెలంగాణ సాహితీవేత ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి నయా భారత్ కా సాహిత్య(అధునిక భారత సాహిత్యం) ప్రారంభించారు. ఈ సదస్సులో అఖిల భారత సంఘటనా మంత్రి శ్రీధర్ పరాట్కర్ మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలోనే విశ్వశాంతి కోసం సాహిత్యం ఉందన్నారు. అఖిల భారత కార్యదర్శి దినేష్ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ వచన కవిత్వం, పద్య కవిత్వం, గద్య కవిత్వంలోని భారతీయత ఉన్నదని సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార్య వ్యవహారాలు అన్ని భారతీయ సాహిత్యంతో ముడిపడి ఉన్నాయన్నారు. 20 రాష్ట్రాల నుంచి పవన పుత్ర బాదల్‌జీ, శ్రీరామ్‌పరివార్(మధ్యప్రదేశ్), తీరు భగద్వాజ్(ఉత్తరఖాండ్), కేసి అజయ్‌కుమార్(కేరళ), సునీల్‌కుమార్ త్రివేది(లక్నో), ఓంప్రకాష్ భార్గవ్(రాజస్థాన్), విజయ్‌గోపాల్(ఆంధ్రప్రదేశ్) భాస్కర యోగి(తెలంగాణ) తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న వక్తలు



సదస్సులో పాల్గొన్న సభ్యులు

ఆశ వర్కర్‌లకు వేతనం పెంచాలి

మణికొండ: గత 18 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఆశ వర్కర్‌లకు పారితోషికాన్ని రూ. 18వేలకు పెంచి ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని గండిపేట మండల ఆశ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాలు అరుణ డిమాండ్ చేశారు.శనివారం గండిపేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం నయాబ్ తహసీల్దార్ జంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్‌లు అనేక శిక్షణలు పొంది బీపీ, షుగర్, థైరాయిడ్ జబ్బులను గుర్తించటంతో పాటు రిజిష్టర్‌లు రాయటం, సర్వేలు చేయటం, ఆన్‌లైన్ పనులు చేయటం చేస్తున్నారన్నారు. కార్యక్రమలో కవిత, శ్రీదేవి, లత, జ్యోతి, ప్రశాంతి, సుకన్య, రుక్మిణి, పద్మ, లావణ్య, సుజాత, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



నయాబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశ వర్కర్‌లు

గేటెడ్ కమ్యూనిటీల సమస్యలు పరిష్కరిస్తాం



హిల్ క్రెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి

– ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి

మణికొండ: ప్రశాంత మైన జీవితం గడపాలని నగర శివారు గేటెడ్ కమ్యూనిటీలలోకి వచ్చినా ఇక్కడా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తామని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్ క్రెస్టె అపార్ట్‌మెంట్స్ గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అసోసియేషన్ వారు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ వాహనాల ఈవీ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నివాసితులు ఆయన దృష్టికి తెచ్చిన విద్యుత్, తాగునీరు, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన మున్సిపల్, జలమండలి, విద్యుత్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మీనా కెమికల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీనా కెమికల్స్, మెట్రో హిల్స్, డ్రీమ్ వెన్యూ, డ్రీమ్ మోనార్చ్, గంగోత్రి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 5 గంటల వరకు గంగోత్రి లెన్, టీఎన్‌జీవోస్ కాలనీ, అమ్మ గార్డెన్ తదితర ప్రాంతాలలో కోత ఉంటుందన్నారు.

స్త్రీవాదం నేటి అవసరం

బాలీవుడ్ నటి, రచయిత్రి కల్కీ కోచ్లిన్

లక్డీకాపూల్: 'ఫెమినిజం అనేది చాలా తప్పు గా అర్థం చేసుకున్న పదం. చాలా సరళంగా..స్త్రీవాదం అంటే సరిపోతుంది. అందరికి సమాన హక్కులు, అవకాశాలు ఇవ్వాలనేదే స్త్రీవాదం. ఇది నేటి అవసరం కూడా' అని భారతీయ సంతతికి చెందిన బాలీవుడ్ నటి కల్కి కోచ్లిన్ అన్నారు. పితృస్వామ్య సమాజంలో జీవిస్తున్నందున స్త్రీవాదం అనేది మన సమాజానికి అవసరమన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్‌లో ఫిక్కీ లేడీస్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'నిజమైన స్త్రీత్వం' అనే అంశంపై ఆమె మాట్లాడారు. పురుషులంద రూ స్త్రీలకు సమానమైన గౌరవం ఇస్తే ఇబ్బందులు తలెత్తవన్నారు. దక్షిణ భారతదేశంలో జన్మించిన తాను భారతీయ వాతావరణం, ఫ్రెంచ్ కుటుంబ అనుబంధంతో పెరిగానన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ రీతూ షా మాట్లాడుతూ స్టైల్ ఐకాన్‌గా పిలిచే కల్కి కోచ్లిన్ లింగ సమానత్వం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈఫిల్ టవర్ రూ పకల్పన, నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించిన ఫ్రెంచ్ స్ట్రక్చరల్ ఇంజనీర్ మారిస్ కోచ్లిన్ వంశస్థురాలే ఈ కల్కి క్లోచిన్ అని చెప్పారు.

